క్లుప్తంగా

కారు, బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు

నకిరేకల్: బైక్ అదుపుతప్పి కారును వెనుకనుంచి ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. నకిరేకల్‌లోని చీమలగడ్డ ఫ్లై ఓవర్‌పై చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. సంస్థాన్ నారాయణపురానికి చెందిన కర్నాటి నరేష్, బొల్లెబోయిన వినోద్ బైక్‌పై సూర్యాపేట వైపు వెళ్తున్నారు. నకిరేకల్‌లోని చీమలగడ్డ ఫ్లైఓవర్ వంతెన వద్దకు చేరుకున్నాక ముందుగా వెళ్తున్న కారును వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బైక్ పై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సుధీర్ తెలిపారు.

ఏఎస్ఐకి పురస్కారం



పురస్కారం అందుకుంటున్న కిశోర్‌కుమార్

నల్లగొండ టౌన్ : సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఎస్ఐగా పనిచేస్తున్న నల్లగొండ పట్టణానికి చెందిన పల్లె కిశోర్‌కుమార్, ఆయన సతీమణి ఝాన్సీ దంపతులకు రితిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో టీఎస్ఐడీసీ చైర్మన్ వేణుగోపాలచారి ఉగాది పురస్కారం అందజేశారు. కిశోర్‌కుమార్ చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా అవార్డు అందజేశారు. కార్యక్రమంలో సినీ యాక్టర్ జగదీశ్వర్, ఏసీపీ రాందాస్, మేకల నాగసింహ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

కనగల్ : కనగల్ ఎక్స్ రోడ్‌లోని శ్రీ భూనీల సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానం నూతన కమిటీని సోమవారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ నిర్మాణ దాత బూసిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ధర్మకర్తగా, మాజీ సర్పంచ్ చిట్ల లింగయ్యగౌడ్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా మరో 15 మందిని ఎన్నుకున్నారు.

శాలిగౌరారం ఎస్ఐగా ప్రవీణ్‌కుమార్



శాలిగౌరారం: శాలిగౌరారం ఎస్ఐగా వి.ప్రవీణ్‌కుమార్ సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. ప్రవీణ్‌కుమార్ నల్ల గొండలోని సీసీఎస్‌లో విధులు నిర్వర్తిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. శాలిగౌరారం ఎస్ఐగా పనిచేసిన ఐలయ్య నల్లగొండ సీసీఎస్‌కు బదిలీ అయ్యారు.

డైరీ ఆవిష్కరణ

మర్రిగూడ: తెలంగాణ నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో 2024 సంవత్సరం డైరీని మండల కేంద్రంలోని ఇరిగేషన్ శాఖ కార్యాలయంలో సోమవారం ఇరిగేషన్ ఈఈ బి.రాములు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఈఈ జె.ఖాసీం, డీఏఓ కె.నాగయ్య, ఎండీ.మహమ్మద్ హబీబ్, జయరావు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

చండూరు : స్వర్ణకార సంఘం మండల సభ్యుడు చొల్లేటి నరహరి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయన వైద్య ఖర్చుల నిమిత్తం మండల స్వర్ణకార సంఘ సభ్యులు చందాలు వేసి పోగుచేసిన రూ.61,500 లను బాధిత కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

మునుగోడు: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గ్రామాల్లో ఎన్నికల కోడ్ పకడ్బందీగా అమలు చేయాలని చండూరు ఆర్డీఓ డి.సుబ్రహ్మణ్యం అధికారులను ఆదేశించారు. సోమవారం మండలంలోని బీరెల్లిగూడెం, కాశవారిగూడెం, రామకృష్ణపురం గ్రామాల్లో నూతనంగా ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వపరంగా ఎలాంటి అభివృద్ధి పనులు ప్రారంభించకుండా చూడాలన్నారు. అదేవిధంగా పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సమయానికి ప్రతి కేంద్రంలో ఓటర్లకు అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని మండల అధికారులకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ ఎం.నరేందర్, ఆర్ఐ నాగరాజు తదితరులు ఉన్నారు.

కారు ఢీకొని ఒకరి మృతి

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి గ్రామ శివారులో జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. పెద్దకాపర్తి శివారులో హైవే దాటుతున్న సుమారు 55ఏళ్ల వయసున్న గుర్తుతెలియని వ్యక్తిని విజయవాడ వైపు నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

సిక్లిగర్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

చిట్యాల: రాష్ట్ర ప్రభుత్వం సిక్లిగర్ (సిక్కు) కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సిక్లిగర్ కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సర్దార్ బహదూర్ సింగ్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. సిక్లిగర్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి బడ్జెట్‌లో వెయ్యి కోట్లు కేటాయించాలని కోరారు.

ప్రమాదాల నివారణ చర్యలు ఏవీ !

- నకిరేకల్–నల్లగొండ హైవేపై తరచూ ప్రమాదాలు
- గత ఆరు నెలల్లో 13 మంది మృత్యువాత
- ఆందోళనలో ప్రజలు, ప్రయాణికులు
- వేగ నియంత్రణ చర్యలు చేపట్టాలని వేడుకోలు



స్పీడ్ బ్రేకర్లు లేని నకిరేకల్- నల్లగొండ హైవే

నకిరేకల్ : రోడ్డు విస్తరణతో ఆ పక్కనే ఉన్న పల్లెల రూపురేఖలు మారాయి. తమ గ్రామాల మీదుగా హైవే వెళుతుండడంతో ఎంతో సంతోషపడిన ప్రజలు, ప్రయాణికులు నేడు అదే రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి వెళుతున్న సిరోంఛ–రేణికుంట రహదారి నిర్మాణంలో భాగంగా నకిరేకల్–నల్లగొండ –నాగార్జునసాగర్ మీదుగా హైవే నిర్మించారు. మహారాష్ట్రలోని సిరోంఛ నుంచి ప్రారంభమయ్యే ఈ జాతీయ రహదారి సూర్యాపేట, నల్లగొండ, గుంటూరు జిల్లా మీదుగా తిరుపతి సమీపంలో రేణికుంట వరకు 643 కిలోమీటర్లు పొడవు ఉంది. రూ.253 కోట్లతో నిధులతో నకిరేకల్ –నాగార్జున సాగర్ రహదారి నిర్మాణం పూర్తిచేసి అందుబాటులో తెచ్చారు.

నల్లగొండకు 20 కిలోమీటర్లు మాత్రమే..

హైవేపై నకిరేకల్–నల్లగొండ మధ్యలో నకిరేకల్ మండలం తాటికల్, తెట్టెకుంట, ఆర్లగడ్డగూడెం, తిప్పర్తి, నల్లగొండ మండలాల్లోని చిన్న సూరారం, పెద్ద సూరారం, చందనపల్లి గ్రామాలు ఉన్నాయి. నూతన రహదారి వెంట ఫుట్‌పాత్‌లు, పార్కింగ్ టైల్స్, గ్రిల్స్, బస్ షెల్టర్లు రెండు వైపులా విద్యుత్ వీధి దీపాలతో ఆయా గ్రామాల రూపురేఖలు మారిపోయాయి. సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ ప్రాంతాల ప్రజలు నల్లగొండ జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు వయా నకిరేకల్–తాటికల్ మీదుగా 20 కిలోమీటర్లు మాత్రమే ఉండడంతో నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ఈ రహదారిపై వాహనాల రద్దీ రోజురోజుకూ పెరుగుతోంది. రోడ్డు విశాలంగా ఉండడంతో వాహనాలు అతి వేగంగా వెళ్తున్నాయి. దీంతో ఈ రహదారిపై ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ రహదారిపై గరిష్టంగా 80 కిలోమీటర్ల వేగంతో ప్రయాణం చేయాలి. కానీ వాహనదారులు 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణం సాగిస్తూ ఎదురుగా వస్తున్న వాహనాలను, ఆగి ఉన్న వాహనాలను, గ్రామాల వద్ద రోడ్డు దాటుతున్న వారిని ఢీ కొడుతున్నారు.

పెరిగిన రాకపోకలు

నకిరేకల్ నుంచి వయా తాటికల్ మీదుగా నల్లగొండకు సుమారు 20 కిలోమీటర్లు దూరం ఉంటుంది. నకిరేకల్ నుంచి కట్టంగూరు మీదుగా వెళ్లాలంటే 35 కిలోమీటర్లు దూరం ఉంటుంది. తక్కువ దూరం ఉండడంతో తాటికల్ మీదుగా హైవేపై ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనాల రాకపోకలు ఎక్కువయ్యాయి. ఈ మార్గంలో గడిచిన ఆరు మాసాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 13 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 50 మందిపై గాయాలపాలయ్యారు. దీంతో ఈ హైవేపై వాహనాల వేగ నియంత్రణ, ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని కోరుతూ ఆయా గ్రామాల ప్రజలు ఇటీవల నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంకు వినతిపత్రం అందజేశారు.

స్పీడ్ బ్రేకర్లు వేయాలి



నల్లగొండ- నకిరేకల్ హైవేలో గల గ్రామాల మధ్య స్పీడ్ బ్రేకర్లు లేవు. తాటికల్ రోడ్డు మీద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనదారులు వేగంగా వస్తూ రోడ్డుపై నడిచేవారిని ఢీకొడుతున్నారు. అతి వేగంతో ప్రమాదాలు జరిగి పలువురు మత్యువాత పడ్డారు.

–చెనగాని సైదులుగౌడ్, తాటికల్

కరువు మండలంగా ప్రకటించాలి



వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

నాంపల్లి : నాంపల్లిని కరువు మండలంగా ప్రకటించాలని కోరుతూ సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్ ఇసాక్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాగిపని అంజయ్య చారి విలేకరులతో మాట్లాడారు. డిండి ఎత్తిపోతల, నక్కలగండి ద్వారా నీరందించే దిశగా కిష్టారాయినిపల్లి, చర్లగూడెం ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసి మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాలకు సాగు, తాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. సాగు నీటి వనరులు లేక రైతులు కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి సుదనబోయిన రమేష్, సహాయ కార్యదర్శులు ఊరుపాక వెంకటయ్య, నేతాళ్లరాజు, మండల కార్యవర్గ సభ్యులు కోరె సత్తయ్య, వెంకటయ్య, యాదయ్య, లక్ష్మయ్య, ఇద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎండిపోయిన పంటచేల పరిశీలన



పంటలను పరిశీలించిన అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

చిట్యాల: నీరు లేక వరి చేలు ఎండిపోయి నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పంట నష్ట పరిహారం అందించాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బొంతల చంద్రారెడ్డి, బండ శ్రీశైలం డిమాండ్ చేశారు. వెలిమినేడు గ్రామ పరిధిలో నీరు లేక ఎండిపోయిన వరి చేలను సీపీఎం రైతు సంఘాల ఆధ్వర్యంలో సోమవారం పరిశీలించారు. అనంతరం వారు చిట్యాలలో తహసీల్దార్ కృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీరు లేక ఎండిపోయిన పంటలకు ఎకరాకు ఇరవై వేల రూపాయలను ప్రభుత్వం నష్టపరిహారంగా అందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అవిశెట్టి శంకరయ్య, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఐతరాజు న ర్సింహ, సీపీఎం మండల రూరల్ కార్యదర్శి అ ర్రూ రి శ్రీను, శీలా రాజయ్య, లడే రాములు, స్వరూప, శంభయ్య, రాములు, లింగయ్య పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



చండూరు : అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత



చిట్యాల: సుంకెనెపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో..

చండూరు: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత కోరారు. సోమవారం గుండ్రపల్లి, చొప్పరివారిగూడెం గ్రామాల్లో పౌష్టిక పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆమె పాల్గొని మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. చిరుధాన్యాలు, పప్పులు, ఆకు కూరలు ప్రతిరోజు తీసుకుంటే ఎంతో మంచిదన్నారు. కార్యక్రమంలో స్వాతి, పంచాయతీ సెక్రటరీ సైదులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: మండలంలోని తాళ్ళవెల్లెంల, సుంకెనెపల్లి గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. పోషకాహారం తీసుకోవడం వల్ల లాభాలపై గర్భిణులకు, బాలింతలకు, యువతులకు అంగన్‌వాడీ టీచర్లు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ సుజిత, అంగన్‌వాడీ టీచర్‌లు ధనలక్ష్మీ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నేడు వీడియో కాన్ఫరెన్స్

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాస్త్రవేత్తలతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి సన్నీరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన రైతులందరూ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలని కోరారు. ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు జరిగే ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ బి.శ్రీనివాస్ వరిలో ప్రస్తుతం పాటించవలసిన మెళకువలు, డాక్టర్ రాజశేఖర్ ఆయిల్ పామ్ సాగు, డాక్టర్ కె.కవిత వేసవి కూరగాయల సస్యరక్షణ చర్యలపై రైతులకు వివరించనున్నట్లు పేర్కొన్నారు. రైతులందరూ హాజరై తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని కోరారు.

చందుపట్లలో..

నకిరేకల్ : మండలంలోని చందుపట్ల గ్రామంలో గల రైతు వేదిక భవన్‌లో మంగళవారం రైతు నేస్తంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి జానిమియా తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందన్నారు.

ఎస్సెస్సీ విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్న డిప్యూటీ తహసీల్దార్

శాలిగౌరారం: మండలంలోని మూడు కేంద్రాల్లో ఎస్సెస్సీ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఇటుకులపహాడ్ గ్రామానికి చెందిన చైత్ర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు యంగలి రామకృష్ణ చేయూతనందించారు. రామకృష్ణ ఆర్థిక సహకారంతో శాలిగౌరారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమాన్ని మండల కేంద్రంలో సోమవారం డిప్యూటీ తహసీల్దార్ సత్తార్ ప్రారంభించారు. చైత్ర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు యంగలి రామకృష్ణ, లయన్స్‌క్లబ్ ప్రతినిధి బుడిగె శ్రీనివాసులు, మాధారంకలాన్ ఎంపీటీసీ నోముల జనార్దన్, నాయకులు బండపల్లి కొమరయ్య, చింత ధనుంజయ్య, యంగలి రాంబాబు, గణేశ్, రమేశ్, సాయి, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

రాగి జావ, మజ్జిగ..

చండూరు: మండల పరిధిలోని బోడంగిపర్తి ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఎం.భాస్కర్ తన సొంత ఖర్చులతో విద్యార్థులకు ఇంటర్వెల్ సమయంలో ఒక రోజు రాగి జావ, మరుసటి రోజు మజ్జిగ అందజేస్తున్నాడు. ఒంటిపూట బడుల కారణంగా విద్యార్థులు ఉదయాన్నే వస్తుండడంతో ఏప్రిల్ 23 వరకు విద్యార్థులకు ప్రతిరోజు మజ్జిగ, రాగి జావ అందజేస్తానని భాస్కర్ సోమవారం తెలిపారు.

కలెక్టరేట్‌లో వినతి



వినతిపత్రం అందజేస్తున్న జానకిరెడ్డి

నల్లగొండ టౌన్ : కట్టంగూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పీఏసీఎస్ సభ్యుడు కట్ట జానకిరెడ్డి సోమవారం కలెక్టరేట్ ఏఓ మోతీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. పాలకవర్గ సమయం ముగిసినప్పటికీ అనధికారికంగా పదవిలో కొనసాగుతూ పీఏసీఎస్ ఆదాయానికి గండికొడుతున్నారని ఆరోపించారు. దుగినెల్లి, మల్లాపురం, కలిమెర గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కొందరు సభ్యులు, సీఈఓలను బినామీలుగా పెట్టుకుని అక్రమార్జనకు పాల్పడుతున్నరని ఆరోపించారు.

ఎంఈఓ కార్యాలయంలో..

చండూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పది సంవత్సరాలుగా మధ్యాహ్న భోజన కార్మికులుగా పనిచేస్తున్న తమను ఇటీవల తొలగించారని, తమను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం ఎంఈఓ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. 4 నెలల వేతనం ఇవ్వకుండానే తమను తొలగించడం సరికాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముదిగొండ సంతోష, భూతరాజు పద్మ, దోమల ధనమ్మ, పేర్ల రాజమ్మలు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ శిబిరం

నకిరేకల్ : మండలంలోని చందంపల్లి గ్రామంలో నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం శీతాకాల ప్రత్యేక శిబిరాన్ని సోమవారం ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్.పి.మద్దిలేటి ప్రారంభించారు. ఈ నెల 24వ తేదీ వరకు చందంపల్లి గ్రామంలో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎస్‌కె అబీబ్‌జానీ, అధ్యాపకులు కె.హరిత, మధుసూదన్‌రెడ్డి, జానయ్య, శంకర్, సురేష్, సురేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 1.8 లక్షల నగదు స్వాధీనం

రామగిరి(నల్లగొండ): పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా తిప్పర్తి పోలీసులు సోమవారం నిర్వహించిన తనిఖీల్లో నగదును స్వాధీనం చేసుకున్నారు. బాపట్లకు చెందిన వల్లెపు నాగేశ్వరరావు హైదారాబాద్ నుంచి అద్దంకికి కారులో వెళ్తుండగా తిప్పర్తి పోలీసుస్టేషన్ సమీపంలో పోలీసులు తనిఖీ చేశారు. అతడి వద్ద రూ. 1.8 లక్షల నగదును గుర్తించారు. పట్టుబడిన నగదుకు సంబంధించి అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

ప్రశాంతంగా ఎస్సెస్సీ పరీక్షలు ప్రారంభం



నల్లగొండ : పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు



నల్లగొండ : హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థినులు

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండల కేంద్రంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 170 మంది విద్యార్థులు, బాలుర జెడ్పీహెచ్ఎస్‌లో 151 మంది విద్యార్థులను కేటాయించారు. మొత్తం 321 మంది విద్యార్థులూ పరీక్షకు హాజరయ్యారు. మంగళవారం హిందీ పరీక్ష జరగనుంది.

కట్టంగూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సాందీపని ప్రాథమికోన్నత, గీతాంజలి ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. గీతాంజలి యూపీఎస్‌లో ఒక విద్యార్థి గైర్హాజరు అయినట్లు ఎంఈఓ మేక నాగయ్య తెలిపారు. మండలంలో మొత్తం 425 మంది విద్యార్థులకు గాను 424 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు.

కేతేపల్లి: మండలంలోని రెండు పరీక్ష కేంద్రాల్లో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. చెరుకుపల్లి పరీక్ష కేంద్రంలో 146 మందికిగాను 146 మంది, కేతేపల్లిలో 243 మందికి గాను 243 విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షల నిర్వహణ తీరను చీఫ్ సూపరింటెండెంట్లు భిక్షమయ్య, యోగీశ్వర్ డీఓలు జెల్లా రమేష్, తీగల డేవిడ్ పర్యవేక్షించారు.

నార్కట్‌పల్లిలో..

నార్కట్‌పల్లి : పదో తరగతి పరీక్షలు సోమవారం మండలంలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. నార్కట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అమ్మనబోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బ్రాహ్మణవెల్లెంల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎస్పీఆర్ స్కూల్ నార్కట్‌పల్లి, శ్రీ చైతన్య స్కూల్‌లలో 696 మంది విద్యార్థులకు గాను పరీక్షలకు వందశాతం విద్యార్థులు హాజరయ్యారని మండల విద్యాధికారి నరసింహ తెలిపారు.

చిట్యాల: పట్టణంలో పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండల వ్యాప్తంగా సోమవారం తెలుగు పరీక్షకు 473 మంది విద్యార్థులకుగాను 472 మంది విద్యార్థులు హాజరయ్యారు.

శాలిగౌరారం: మండలంలో పదో తరగతి బోర్డు పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. శాలిగౌరారంలో రెండు, మాధారంకలాన్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఒక కేంద్రం ఏర్పాటుచేశారు. మండలంలోని 337 మంది విద్యార్థులకు గానూ 337 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. శాలిగౌరారంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 127 మంది, గీతాంజలి ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 112 మంది, మాధారం కలాన్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 98 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ వెంకటేశంతో పాటూ ఎంపీడీఓ లక్ష్మయ్య, ఎంఈఓ నాగయ్య, డిప్యూటీ తహసీల్దార్ సత్తార్ తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తును సీఐ శ్రీనివాస రెడ్డి పర్యవేక్షించారు.



కట్టంగూర్ : సాందీపని పాఠశాలలో విద్యార్థులను చెక్‌చేస్తున్న ఇన్విజిలేటర్లు



తిప్పర్తి మోడల్ స్కూల్‌లో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

పది పరీక్షకు వందశాతం హాజరు

మునుగోడు: మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాతంగా ప్రారంభమయ్యాయి. మునుగోడు మండలంలో మొత్తం 446 మంది విద్యార్థులు ఉండగా అధికారులు రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేశారు. రెండు కేంద్రాల్లోనూ అందరు విద్యార్థులు హాజరై పరీక్ష రాశారు. పరీక్ష కేంద్రాలను రాష్ట్ర పరిశీలకుడు రమణకుమార్‌తో పాటు స్థానిక అధికారులు పరిశీలించారు.



మునుగోడు: పరీక్ష కేంద్రంలోకి వెళ్లే విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఇన్విజిలేటర్లు

మర్రిగూడ: మండల కేంద్రంలోని హైస్కూల్, ఆదర్శ పాఠశాలలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. హైస్కూల్‌లో 160 మంది విద్యార్థులకుగాను 159 మంది హాజరవగా ఒకరు గైర్హాజరయ్యారు. ఆదర్శ పాఠశాలలో 134 మందికిగాను 134 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష ప్రశాంత వాతావరణంలో కొనసాగిందని సీఎస్‌లు పద్మచారి, మధు, డీఓలు పద్మజ, రామతులసి తెలిపారు.



శాలిగౌరారంలోని ఎస్సెస్సీ పరీక్ష కేంద్రం వద్ద..



నార్కట్‌పల్లి : పరీక్ష కేంద్రం వద్ద ..



కేతేపల్లిలో ..

గృహజ్యోతి దరఖాస్తులకు బ్రేక్



దరఖాస్తులు ఇచ్చేందుకు వచ్చిన మహిళలు

మర్రిగూడ: రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన నిరుపేదలకు గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తోంది. అర్హత ఉండి పథకం అందని వారు ఈ నెల 5 నుంచి శనివారం వరకు 461 మంది గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. అందులో 388 దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయినట్లు ఎంపీడీఓ జి.చినమునయ్య తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సోమవారం నుంచి దరఖాస్తులు తీసుకోవడానికి బ్రేక్ పడడంతో అర్హత కలిగిన దరఖాస్తుదారులు రోజంతా పడిగాపులు కాసి తిరుగు ప్రయాణమయ్యారు. ఎన్నికల కోడ్ ముగిసేంతవరకు దరఖాస్తులను స్వీకరించబోమని ఎంపీడీఓ తెలిపారు.

ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

శాలిగౌరారం: రంజాన్ మాసం సందర్భంగా ఉపవాస దీక్షలో ఉన్న జాలోనిగూడెం ముస్లింలకు బీజేపీ మండల అధ్యక్షుడు జమ్ము రమేశ్ సోమవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మసీదులో ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ముస్లింలు ఉపవాస దీక్షను వదిలి విందులో పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన



విద్యార్థినులతో మాట్లాడుతున్న అంజన్‌రావు

చండూరు: పట్టణంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని మానవ హక్కుల పరిరక్షణ సంఘం సభ్యుడు పానుగోటి అంజన్‌రావు, ఎస్ఏసీ మెంబర్ మతిన్ అహ్మద్, సీడబ్ల్యూసీ మెంబర్ భాస్కర్, ఎంఈఓ గురువారావు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, బాలిక విద్య ప్రాధాన్యతపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. పాఠశాలలో వసతి సదుపాయాలు, మెనూ వివరాలను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారిని మంజుల, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతాప్రమాణాలు పాటించాలి

నకిరేకల్ : మున్సిపాలిటీ కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఏరియా ఆస్పత్రి పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని సీపీఐఎంఎల్ న్యూడెమాక్రసీ జిల్లా నాయకుడు అంబటి చిరంజీవి కోరారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మామిడోజు వెంకటేశ్వర్లు, బండారు వెంకన్న, పిట్టల అనిల్, సైదులు, సోమన్న తదితరులు పాల్గొన్నారు.